క్లుప్తంగా

ఆయిల్‌పామ్ సాగే లక్ష్యంగా ముందుకు



రేగొండ: దీర్ఘకాలిక ప్రయోజనాలు ఇచ్చే ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా రైతులు ముందుకు సాగాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సంజీవ రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆయిల్‌పామ్ నర్సరీని ఆయన పరిశీలించారు. నర్సరీలోని మొక్కల ఆరోగ్య పరిస్థితి, సస్యరక్షణ పద్ధతులు, రిజిస్టర్ నిర్వహణ గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నర్సరీలో మూడు లక్షల తొంభై నాలుగు వేల మొక్కలు ఉన్నాయని, ఆసక్తి గల రైతులు నర్సరీ నుంచి రాయితీపై మొక్కలు తీసుకోని సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డివిజన్ ఉద్యానశాఖ అధికారి సునీల్ కుమార్, ఆయిల్ పామ్ నర్సరీ సిబ్బంది గవాస్కర్, అరవింద్ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కాటారం: జిల్లా కేంద్రంలో ఈ నెల 14, 15న సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పార్టీ జిల్లా స్థాయి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు తెలిపారు. ఈ మేరకు శనివారం పార్టీ నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. తరగతుల జయప్రదానికి ప్రతి ఒక్కరూ తమవంతు ఆర్థిక సాకారం అందించి సీపీఎం భవిష్యత్ పోరాటాలకు తోడ్పాటును అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోలం రాజేందర్, మండల కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్, మండల కమిటి సభ్యులు శ్రీలత, బొడ్డు కిషోర్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



వెంకటాపురం(కె): మండల కేంద్రంలో శనివారం చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది రక్తదానం చేశారు. ఈ క్యాక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేందర్, విద్యుత్ శాఖ ఏఈ సునీల్, ఆకుల గోపి, గుండమల్ల మధు, సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్ ఉన్నారు.

ఉత్సవాలకు తరలిరావాలి

ఏటూరునాగారం: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి జిల్లా నుంచి తెలంగాణ ఉద్యమ కారులంతా నేడు హైదరాబాద్‌కు తరలిరావాలని తెలంగాణ జేఏసీ జిల్లా చైర్మన్ చాప బాబు దొర ఉద్యమకారులకు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు, ఆవిర్భావ దినోత్సవం వేడుకలను హైదరాబాద్‌లోని పెరేడ్ మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుండటంతో ఉద్యమకారులు తరలిరావాలని అన్నారు.

సమయపాలన పాటించని అధికారులు

కన్నాయిగూడెం: మండలంలోని విధులు నిర్వహిస్తున్న అధికారులు సమయపాలన పాలన పాటించకుండా ఇష్టంవచ్చినప్పుడు వస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు అన్నారు. మండలంలోని వివిధ కార్యాలయాలను శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. పనులపై కార్యాలయాకు వచ్చిన ప్రజలకు తిప్పలు తప్పడంలేదన్నారు. రెవెన్యూ అధికారులకు ఇసుక క్వారీలపై ఉన్న ప్రేమ ప్రజల సమస్యలపై చూపడంలేదన్నారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్, ఆర్‌ఐ కుర్చీలు ఎప్పుడు ఖాళీగానే ఉంటున్నాయన్నారు. సామాన్య ప్రజలు అవసరాల కోసం ఇసుక అనుమతి ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. వెంటనే కలెక్టర్, ఆర్డీఓ స్పందించి దర్యాప్తు నిర్వహించి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గుండెపోటుతో కార్మికుడి మృతి



అశోక్ (ఫైల్)

ములుగు: జిల్లా కేంద్రానికి చెందిన సింగరేణి కార్మికుడు అశోక్(40) గుండె నొప్పితో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. అశోక్ జిల్లా కేంద్రంలో నివాసం ఉంటూ భూపాలపల్లి 08వ ఇంక్‌లైన్లో సింగరేణి కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం అతడి నివాసంలో గుండెపోటు రావడంతో విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో వెంటనే జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.



కమలాపురంలో పూజల్లో పాల్గొన్న ఏఎస్పీ మహేష్ గీతే బాబాసాహెబ్



వాజేడులో..



వెంకటాపురం(కె)లో..



ఏటూరునాగారం: అన్నదాన కార్యక్రమంలో ..

హనుమాన్ జయంతి వేడుకలు

వెంకటాపురం(కె): మండలంలో శనివారం ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు. మండల పరిధిలోని ఆలుబాక, చొక్కాల, వెంకటాపురం మండల కేంద్రంలోని శివాలయం సమీపంలోని హనుమాన్ టెంపుల్, పెరిక బజారులోని మంగపేట గోదావరికి వెళ్లే రహదారి సమీపంలోని హనుమాన్ ఆలయం వద్ద జయంతి వేడుకలను ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జయంతి వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చలువ పందిల్లు, తాగు నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డర్రా దామోదర్, మడుగూరి సత్యనారాయణ ఉన్నారు.

వాజేడు: మండల పరిధిలోని ధర్మవరంలో గ్రామానికి చెందిన భక్త జన బృందం ఆధ్వర్యంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పూజలు జరిపించి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఆ తరువాత స్వామి వారికి శాస్త్రోక్తంగా పత్ర, ఫల, పుష్పాలతో విడివిడిగా పూజలను అర్చకులు చేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు



ఏటూరునాగారంలో..

అభిషేకాలను చేయించుకున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి పలు గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు.

మంగపేట: మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని కమలాపురం, కోమటిపల్లి, నర్సింహాసాగర్, రాజుపేట, అకినేపల్లిమల్లారం తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి దీక్ష చేపట్టిన వందలాది మంది భక్తులు దీక్ష పూర్తి కావడంతో ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఇరుముడి అప్పగించి దీక్ష విరమించేందుకు భద్రాచలం, కొండగట్టు తదితర ప్రాంతాలకు వెళ్లారు. కమలాపురం అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదాన ప్రసాదం కార్యక్రమాన్ని ఏటూరునాగారం ఏఎస్పీ మహేష్ గీతే బాబాసాహెబ్ ప్రారంభించారు.



వెంకటాపురం(కె): చొక్కాల వద్ద అన్నదాన కార్యక్రమంలో భక్తులు

ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి విగ్రహానికి స్థానిక ఏఎస్పీ మహేష్ గీతె బాబాసాహెబ్, సీఐ రాజు, ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. అర్చకులు సూర్యనారాయణశర్మ, భానుప్రకాష్‌శర్మ, మణికంఠశర్మ, రామ్మూర్తి శర్మలు అర్చనలు, పంచామృత అభిషేకాలను చేసి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీరాం సురేష్, వద్ది నరేష్, వంగుమూరి గౌతమ్ చౌదరి, రవీందర్, నాగరాజు, రాజు, శ్యామల్‌నాయక్, చిప్ప అశోక్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దయ చూపండి..!

- లివర్ సమస్యతో బాధపడుతున్న బాలుడు
- దాతల సాయం కోసం ఎదురుచూపు



తల్లితో బాబు వర్షిత్ కుమార్

దీన గాథ

మల్హర్: అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న బాబు అనారోగ్యంతో ఆస్పత్రి పాలు కావడంతో తల్లిదండ్రుల బాధ వర్ణాతీతం. వైద్యం చేయడానికి ఆర్థిక స్థోమత లేక తమ బాబును బతికించండని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. మల్హర్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన బుట్టి శ్యామల–రాజ్‌కుమార్ యాదవ్ దంపతులకు 7 నెలల కుమారుడు వర్షిత్‌కుమార్ ఉన్నాడు. 3 నెలల వయసులోనే వర్షిత్‌కు అనారోగ్యంతో పలు ప్రైవేట్ ఆస్పత్రిల్లో వైద్యం చేయించారు. పరీక్షించిన వైద్యులు లివర్ ఇన్ఫెక్షన్ అయిందని, లివర్ మార్పిడి చేయాలని సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అందుకు రూ.35 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు పేర్కొన్నట్లు తెలిపారు. గ్రామంలో మేకల కాపరి, కూలీ పనులు చేసుకోని జీవనం సాగిస్తున్న కుమార్ ఆర్థిక పరిస్థితి అంత మాత్రమే కావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వైద్యం అందించడానికి డబ్బులు లేక బాధతో మరోపక్క బాబు పరిస్థితి చూడలేక ఆందోళన చెందుతున్నారు. దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఫోన్ నంబర్లు 6304441688, 6305779113లకు ఫోన్‌పే, గూగుల్‌పే సాయం చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ఏజెన్సీలో ఇసుక మాఫియా



నినాదాలు చేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: ఏజెన్సీ ప్రాంతంలో ఇసుక మాఫియా రాజ్యమేలుతుందని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మైపతి అరుణ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తుడుందెబ్బ జిల్లా కొరగట్ల లక్ష్మణ్ అధ్యక్షతన జిల్లా కమిటీ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని గోదావరి నది పరివాహక ప్రాంతంలో 5వ షెడ్యూల్ నిబంధనలు అతిక్రమించి ఇసుక మాఫియా వేల కోట్ల రూపాయాలు దోపిడి చేస్తుందన్నారు. రెవెన్యూ పట్టాలకు అనుమతి ఇచ్చి ఇసుక క్వారీలకు అనుమతి ఇచ్చామని ప్రభుత్వం గోదావరి నది వాగుల ప్రాంతంలో ఉన్న రెవెన్యూ పట్టాలకు అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇలాగే మరో పదేళ్ల వరకు ఇసుక తవ్వకాలు కొనసాగితే భూగర్భజలాలు తగ్గిపోయి దాని ప్రభావం పర్యవరణంపై పడి ఆదివాసీ తెగల జీవనమే ప్రమాదంతో పడుతుందన్నారు. ఇసుక లారీల వేగం వలన ఆదివాసీల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి అన్నారు. ఏటూరునాగారం, కిన్నెరసాని అభయరణ్యమని అర్ధరాత్రి ఇసుక లారీలకు అనుమతి ఉండదన్నారు. అటవీశాఖ అధికారులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసిన ప్రయోజనం లేదన్నారు. వన్యప్రాణిజోన్‌లో రాత్రి 9గంటలు దాటిన తర్వాత భారీ వాహనాల నిలిపివేయాలన్న నిబంధనలను గాలికి వదిలేశారన్నారు. గోదావరి నదిలో అక్రమ పట్టాల పేరిట అనుమతులు ఇచ్చిన రెవెన్యూ, జియాలజీ, పర్యవరణ శాఖ, ఐటీడీఏ అధికారులను వన్యప్రాణి జోన్‌లో అనుమతులు ఇచ్చిన అటవీ శాఖ అధికారులపై న్యాయ స్థానాలను ఆశ్రమిస్తామన్నారు. ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోర్నిబెల్లి గణేష్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు



యోగా నేర్చుకుంటున్న క్రీడాకారులు



హ్యాండ్‌బాల్ శిక్షణ ఇస్తున్న కోచ్ కుమారస్వామి

ఏటూరునాగారం: ప్రభుత్వం వేసవిలో 14 ఏళ్ల లోపు ఉన్న బాల బాలికలకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు జిల్లా యువజన క్రీడాశాఖల ద్వారా రూపకల్పన చేసింది. ఈమేరకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలతో మే1న ప్రారంభించిన క్యాంపులు జూన్1 వరకు నిర్వహించారు. ఈ వేసవి శిక్షణలో నేర్చుకున్న క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్, ఇతర క్రీడల్లో రాణించి పథకాలను సాధిస్తున్నారు. జిల్లాలో 10 కేంద్రాలను ఏర్పాటు చేసి ఒక్కో కేంద్రంలో 60 మంది చొప్పున శిక్షణ ఇచ్చారు. ఏటూరునాగారంలో మానసిక ఉల్లాసం కోసం యోగాను కోచ్ పర్వతాల కుమారస్వామితోపాటు మరికొంత మంది కోచ్‌లు శిక్షణ ఇచ్చారు. పరుగు పందం ఏర్పాటు చేసి వ్యాయామం చేయిస్తూ హ్యాండ్‌బాల్ శిక్షణ ఇచ్చారు

క్రీడాకారులకు ఉచిత శిక్షణ



కలెక్టర్ ఆదేశాలతో క్రీడాకారులకు హ్యాండ్‌బాల్ క్రీడకు ఉచిత శిక్షణ ఇచ్చాం. 60 మంది ప్రతి కేంద్రంలో ఉండేలా ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చాం. అందుకు అనుభవజ్ఞులైన కోచ్‌లతో శిక్షణ ఇవ్వడం జరిగింది. దీంతో మంచి ఫలితాలు వస్తున్నాయి.

– తుల రవి, జిల్లా యువజన, క్రీడల అధికారి

ఉచితంగా కోచింగ్ ఇస్తున్నా..



హ్యాండ్‌బాల్ క్రీడను మరింత ముందుకు తీసుకెళ్తా. ఐదు సంవత్సరాల నుంచి ఏటూరునాగారం క్రీడామైదానంలో హ్యాండ్ బాల్ ఫిట్నెస్‌పై ఉచితంగా కోచింగ్ ఇస్తున్నా. ఇక్కడ నుంచి క్రీడాకారులను జాతీయ స్థాయికి, రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లి మెడల్స్ సాధించుకున్నారు.

– కుమారస్వామి, హ్యాండ్‌బాల్ కోచ్

శాశ్వత కోచ్‌ను ఏర్పాటు చేయాలి



గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది విద్యార్థులు క్రీడలపై మొగ్గుచూపుతున్నారు. ఏటూరునాగారంలో అతిపెద్ద క్రీడా మైదానం ఉండడం వల్ల శాశ్వతంగా ఇక్కడ ఒక కోచ్‌ను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం, పాలకులు దీనిపై దృష్టి పెట్టాలి.

– అరవింద్, ఏటూరునాగారం

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

మంగపేట: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎక్కటి సరోజిని శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గుళ్ల వెంకటయ్య తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కాలేజీలో శనివారం కళాశాల ప్రగతిని తెలిపే ఫ్లెక్సీలు, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేట్ కళాశాలకు దీటుగా బోధన చేస్తూ ఉత్తమ ఫలితాలను సాధిస్తున్న తమ జూనియర్ కళాశాల 2024 వార్షిక పరీక్షల్లో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులను సాధించి సత్తా చాటిందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు వేలాది రూపాయల విలువైన పాఠ్య పుస్తకాలను ఉచితంగా అందిస్తు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఉచిత బోధన చేస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చుదిద్దుతున్నట్లు తెలిపారు. పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు కాలేజీలో చేరి ఉత్తమ విద్యను పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రేణుకాదేవి, జ్యోతిర్మయి, సంతోష్‌కుమార్, లక్ష్మణ్, అనిల్‌కుమార్, శ్రీనివాస్, రవీంద్రనాయక్, చిరంజీవి, వందన, వైష్ణవి సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్లెక్సీలు, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



మల్హర్: అవగాహన కల్పిస్తున్న ఏఈఓ అనూష



పలిమెల: షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

మల్హర్: విత్తన కొనుగోలు విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఏఈఓ అనూష తెలిపారు. మండలంలోని ఎడ్లపల్లి, కొండంపేట గ్రామాల్లో విత్తన కొనగోళ్లపై శనివారం ఏఈఓ అనూష రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు.

పలిమెల: లైసెన్స్ పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మహేష్ రైతులకు సూచించారు. శనివారం వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా మండలంలోని విత్తన దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. అంతేకాకుండా రిజిస్టర్, బిల్‌బుక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మహేష్ మాట్లాడుతూ.. గ్రామాల్లోకి రాత్రి వచ్చి విక్రయించే నకిలీ విక్రయిదారుల నుంచి కొనుగోలు చేయొద్దన్నారు. బీజీ–3 పేరుతో చలామణి అవుతున్న పత్తి విత్తనాలకు అనుమతి లేనందున ఈ రకం విత్తనాలను కొనడం, అమ్మడం సాగు చేయడం నేరమన్నారు.

ఇద్దరికి గాయాలు

ఏటూరునాగారం: ఎద్దులు మీదపడి ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి శనివారం మండల కేంద్రానికి చెందిన కొండ ఉదయ్, ఇర్సవడ్ల కిరణ్ ద్విచక్రవాహనంపై ఏటూరునాగారం నుంచి క్రాస్‌రోడ్డు వెళ్తుండగా రోడ్డుపై ఉన్న పశువులు మీదపడపడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. రోడ్లపై ఉన్న పశువులను కట్టడి చేయడంలో గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపించారు.

ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు



ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

మంగపేట: మండల కేంద్రం పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోడౌన్ల నుంచి కమలాపురం మధ్య ఇసుక లారీల వలన ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని పొదుమూరు గోదావరి ఇసుక క్వారీకి లోడింగ్ కోసం వచ్చే లారీలను ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై నిలిపి వేస్తున్నారు. వచ్చి పోయే ఆర్టీసీ బస్సులు, వాహనాలతో పాటు మణుగూరు వైపు నుంచి ఇసుకలోడుతో వరంగల్, హైదరాబాద్ తదితర పట్టణాలకు వెళ్లే లారీల కారణంగా నిత్యం ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తుతోంది. శనివారం మార్కెట్ గోదాముల నుంచి కమలాపురం వరకు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామైంది. ఇసుక లారీలను ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన క్వారీ యజమానుల నిర్లక్ష్యం కారణంగా నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదరవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు



లారీని తనిఖీ చేస్తున్న ఎస్సై

వాజేడు: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలను తీసుకుంటామని ఎస్సై వెంకటేశ్వర రావు హెచ్చరించారు. మండల పరిధిలోని మండపాక గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసుక లారీలను ఆపి తనిఖీ చేశారు. పరిమితికి మించి ఇసుకను తరలించినా, వేబిల్ లేకుండా, ఒకే వే బిల్‌పై నంబర్ ప్లేట్ మార్చి రవాణా చేసినా చర్యలను తీసుకుంటామన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర



కళాకారులతో ఎమ్మెల్యే సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకోడేపాకలోని పెద్ద చెరువు మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే గండ్ర మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో కురిసిన భారీ వర్షాలకు చెరువు తెగిపోవడంతో, మరమ్మతు పనుల కోసం రూ.3.63 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. వానాకాలం సీజన్ నాటికి రైతాంగానికి నీటిని అందించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నాయిని సంపత్ రావు, మోడెం ఉమేష్ గౌడ్, సూదనబోయిన ఓంప్రకాశ్, మైస భిక్షపతి, సదానందం పాల్గొన్నారు.

కళలను ప్రదర్శించడం అభినందనీయం

నేటి ఆధునిక సమాజంలో కనుమరుగైపోతున్న కళలను నాటకాల రూపంలో ప్రదర్శించడం అభినందనీయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. కొత్తపల్లిగోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో చిరుతల రామాయణ భక్త మండలి వారి ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు జరిగే శ్రీరామ పట్టాభిషేక మహోత్సవ చిరుతల రామాయణం నాటిక ప్రదర్శన ప్రారంభ మహోత్సవానికి శనివారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి నాటిక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలో చైతన్యం కలిగించే నాటికలు రావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం భక్తమండలి సభ్యులు, కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యేను శాలువతో ఘనంగా సన్మానించారు.